# పాము

"అమ్మో... పాము"

సిమ్మాచలం కేకతో - పాలుతాగుతున్న బాబుని భుజంమీద వేసుకు బైటికి పరుగెత్తుకొచ్చింది రత్తాలు.

ఒక్కసారిగా చీకటి రత్తాలుని బలంగా చుట్టేసి ఉక్కిరిబిక్కిరి చేసింది.

"యాడయ్యా పాము - యాడా" అని అడుగుతూనే భర్త కోసం ఆత్రుతగా చూసింది.

అల్లంత దూరంలో నేల మీద పడి ఉన్నాడు సిమ్మాచలం.

"అదిగోనే.. అదిగో - మన గుడిసెలోకే పోతోంది"

లేవడానికి ప్రయత్నిస్తూ అన్నాడు సిమ్మాచలం.

అపుడు చూసింది రత్తాలు. తమ గుడిశెలోని గుడ్డి దీపం వెల్తురులో మెరుస్తో కన్పించి - క్షణంలో లోపలికి అదృశ్యమైపోయిన బారెడు పొడవున్న పాముని.

"ఓలమ్మో.... పాము" అప్రయత్నంగానే పెద్దగా కేకలు పెట్టింది రత్తాలు.

ఆ కేకలకు ఇరుగుపొరుగున ఉన్న వాళ్ళంతా పరుగెత్తుకొచ్చారు - కర్రలూ, లాంతర్లూ పట్టుకుని.

నలుగురు మనుషులు గుడిశెలోకి వెళ్ళి అంగుళం అంగుళం గాలించినా పాము జాడ కన్పించలేదు.

సిమ్మాచలాన్ని లోపలికి మోసుకెళ్ళి మంచంమీద పడుకోబెట్టారు.

"చీకట్లో చూసుకోకుండా పాము మీద కాలేసి ఉంటాడు - కుట్టింది" ఆ గుంపులో ఎవరో అన్నారు.

"నాగుపామే అయి ఉంటుంది. సిమ్మాచలం ఎలా అయిపోతున్నాడో చూశారా" అన్నాడు మరొకడు.

అప్పటికే సిమ్మాచలం నోటి నుంచి నురగ రావటం ప్రారంభమైంది.

రత్తాలు భోరుమని ఏడుస్తోంది. పసివాడిని గుండెలకు హత్తుకుని - తలబాదుకుని మరీ ఏడుస్తోంది.

"రత్తాలు కాపురానికొచ్చి రెండేళ్ళయినా కాలేదు. దేవుడు దాని నుదుట అలాంటి రాత రాశాడు" కొంతమంది స్త్రీలు జాలిగా అనుకుంటున్నారు.

మరికొన్ని నిముషాలకు సిమ్మాచలం చనిపోయాడు.

***

సిమ్మాచలం చిననాయుడి దగ్గిర పాలేరు పనిచేసేవాడు. నల్లగా, ఎత్తుగా, బలిష్ఠంగా ఉండే సిమ్మాచలం అంటే ప్రత్యేకమైన అభిమానం నాయుడికి. మంచి వయసులో ఉండటంవల్లనేమో నాయుడు ఏ పని చెప్పినా కాదనకుండా క్షణాల్లో పూర్తిచేసుకుని వచ్చేవాడు సిమ్మాచలం.

చిననాయుడి తండ్రి పెదనాయుడి దగ్గిర సిమ్మాచలం తండ్రి పాలేరుగా పనిచేశాడు. ఆ రోజుల్లో పెదనాయుడుగారు ఆ వూరికి మకుటంలేని మహరాజు. అతని మరణం తర్వాత అతని కొడుకు చిననాయుడు రాజరికం చలాయించటం ప్రారంభించాడు. మూడువేల జనాభాకు మించని ఆ గ్రామంలో చీమ చిటుక్కుమన్నా చిననాయుడికి తెల్సిపోతుంది. గాలి కదలాలన్నా చిననాయుడిని చూసి - జడిసి - ఆగి - మరీ కదులుతుంది. ఆ వూరిలో చిననాయుడు చెప్పిందే వేదం. చిననాయుడి మాటే శాసనం.

అటువంటి చిననాయుడి దగ్గర పనిచేసే పాలేరు - పని ముగించుకుని ఇంటికెళ్తూ - ఇంటికి పదిగజాల దూరంలోనే పాముకాటుతో చనిపోతే - పరామర్శించకుండా, పట్టించుకోకుండా నాయుడుగారు ఎలా ఉండగలరు?

అందుకే సిమ్మాచలం చివరి కర్మకాండలన్నీ స్వంతఖర్చుతో దగ్గిరుండి జరిపించేరు.

పావుబస్తా బియ్యం, అరబస్తా జొన్నలు రత్తాలు ఇంటికి పంపించారు.

"ధర్మప్రభువు" అంటూ ఆ వూరి జనాలంతా పొగిడారు.

ఓ పక్షంరోజులు గడిచి - కొంత సద్దుమణిగాక నాయుడుగారి పాలేరు రత్తాలు ఇంటికెళ్ళాడు.

"దొర పిలుస్తుండు" అన్జెప్పి అక్కడే నిలబడ్డాడు.

రత్తాలు వూహించిన విషయమే అది. ఎన్నాళ్ళని పనికెళ్ళకుండా కూచుని తింటుంది! ఏదో ఓ బతుకు తెరువు చూపించడానికే నాయుడు కబురంపి ఉంటాడని - బాబునెత్తుకుని గుడిశెకున్న తలుపు దగ్గిరగా వేసి పాలేరు వెంట బయల్దేరింది.

చిననాయుడు వసారాలో పడక్కుర్చీలో కూచుని చుట్ట తాగుతున్నాడు.

"దండాలు దొరా" అంది రత్తాలు.

చిననాయుడు తలయెత్తి చూశాడు.

ఎదురుగా రత్తాలు తలవొంచుకుని నిలబడి ఉంది. భుజం మీద బాబున్నాడు.

ముతక చీరలో కూడా ముగ్ధ మనోహరంగా ఉంది రత్తాలు. ఇరవై కూడా పూర్తిగా నిండని వయసు తెచ్చిన నిగారంపు ఉంది శరీరంలో -నల్లగా ఉన్నా మొహంలో అంతులేని కళ ఉట్టిపడుతోంది. చక్రాల్లాంటి కళ్ళు - పల్చటి పెదాలు - పొంకంగా - నిటారుగా కన్పిస్తున్న వక్షం...

బలవంతంగా కళ్ళు మరల్చుకున్నాడు చిననాయుడు.

"ఏమే రత్తాలు - సిమ్మాచలం పోయిన కాణ్ణించి అలా ఇంట్లోనే కూచుంటె ఎలా జరుగుద్ది - ఏదో పనోపాటో చేసుకోకపోతే కూడెలా దొరుకుద్ది - ఆ విషయం ఆలోచించావా" అన్నాడు సాలోచనగా చూస్తూ.

రత్తాలు మౌనంగా నిలబడింది.

"రేపట్నించి పొలంలోకి రా పనిస్తాను"

రత్తాలు చేతెలెత్తి నమస్కరించంది. తనకు తెల్సు - దొరే ఏదో ఒక దారి చూపిస్తాడని.

"అట్టాగే దొర" అన్జెప్పి వెనక్కి తిరిగింది.

చిననాయుడిలో కోరిక పడగలు విప్పుకుంటోంది.

"లోపలికెళ్ళి అమ్మగారితో చెప్పి ఇన్ని గింజలు పట్టుకెళ్ళు" అన్నాడు నాయుడు. అప్పటికే కళ్ళలో ఎర్రజీరలు మెలికలు తిరిగిన పాముల్లా పాడుచుకొచ్చాయి.

వెనక్కి తిరిగి వెళ్ళబోతున్నదల్లా ఆగి నాయుడివైపు చూసింది రత్తాలు.

"మొన్నెపుడో పంపిన గింజలు ఇంకా ఉంటాయా - తిండి తినకుండా పొలంలో పనేం చేయగలవు - లోపలికెళ్ళి గింజలు పట్టుకెళ్ళు".

రత్తాలు కళ్ళలో కృతజ్ఞతతో నీళ్ళు తిరిగాయి.

ఇంట్లోకి పోబోతున్న రత్తాలుని కళ్ళతోనే ఆపాడు నాయుడు.

"చంకలో ఆడెందుకే - ఈడికియ్యి - ఎత్తుకుంటాడు." ఎదురుగా ఉన్న పాలేరుని చూపించాడు. రత్తాలు బాబుని పాలేరుకిచ్చి లోపలికి నడిచింది.

నాయుడు పాలేరువైపు భావగర్భితంగా చూసి రత్తాలు వెనకే నడిచాడు.

"అమ్మగోరు, అమ్మగోరూ" అంటూ గదులన్ని వెతుకుతున్న రత్తాలు గమనించనే లేదు తలుపులు మూసుకోవటం. బెదిరినట్లయి వెనక్కి తిరిగింది రత్తాలు. పర్వతంలా నిలబడి నవ్వుతున్న చిననాయుడు.

"అమ్మగోరు......" అంటూ మధ్యలోనే ఆపేసి భయంగా చూసిన రత్తాలు భుజంమీద చేయివేస్తూ చెప్పాడు నాయుడు -

"అది వూరెళ్ళి వారం అయింది. మొగుడు లేకుండా - మగవాడి తోడు లేకుండా నీవైనా ఎన్నాళ్ళుంటావు - మంచి వయసులో ఉన్నావాయే - ఆడు నిన్ను యిరవై యేళ్ళకు విధవను చేసి పోయాడు. అయినా నీకు తెల్సుకదా! సిమ్మాచలం నిన్ను మనువాడి తెచ్చినప్పటి నుండీ నాకు నీమీద మనసుందని. నా కోరిక తీర్చు" పైన బడ్డాడు చిననాయుడు.

రత్తాలు ఏడ్చింది - అరిచింది - అభ్యర్థించింది. చేతులు జోడించింది - కాళ్ళు పట్టుకుంది - చివరికి ఓడిపోయింది.

"రేపు పొలం పనికి రావటం మర్చిపోకు" ఏడుస్తున్న రత్తాలు ఒంటిమీదకి చీరని విసిరేస్తూచెప్పాడు నాయుడు.

★★★

గుడిశెకున్న నిట్రాడికి తాడు బిగించింది రత్తాలు. తనువు పాడైపోయాక తను బ్రతకటం వ్యర్థమని నిర్ణయించుకుంది. మంచం కోడు మీద నిలబడి తాడుని మెడకు బిగించుకుంది.

యిపుడాతాడు సిమ్మాచలాన్ని కాటేసిన పాములా ఉంది. గుడిశెలోకి పాము దూరినప్పటినుండీ ఏది చూసినా రత్తాలుకి పాములానేకన్పిస్తోంది.

తన మెడమీద బిగుసుకున్న చిననాయుడి చేతుల్లా ఉంది తాడు అనుకుంది రత్తాలు. నాయుడి చేతులకు - నాగుపాముకు తేడా తెలియటం లేదు. పెళ్ళయి వచ్చిన కొత్తలో - నాయుడు రెండు మూడుసార్లు కబురంపాడు. తను ఛీ కొట్టి పంపింది. ఓ సారి నాయుడే స్వయంగా వచ్చి తన కోరిక తెలిపాడు. తను చాలా తీవ్రంగా మందలించింది. తన ప్రాణాలు పోయినాసరే అతనికి లొంగేది లేదని చెప్పింది. ఆ సంఘటన జరిగాక నాయుడెపుడూ తన కోసం ప్రయత్నించలేదు. వ్యర్థమని తలచి ప్రయత్నాలు విరమించుకున్నాడని నమ్మింది రత్తాలు. కానీ కబళించటానికి పొంచి ఉన్న చిరుతపులిలా నాయుడు వేచి ఉన్నాడని తెల్సుకోలేక పోయింది. సిమ్మాచలాన్ని కాటేసిన పాము చిననాయుడు ఏర్పాటు చేసిందేననే విషయం కర్ణాకర్ణిగా తనూ విన్నది. ఎటొచ్చీ నమ్మలేకపోయింది... కానీ.. ఇపుడాలోచిస్తే....

రత్తాలుకు క్షణం సిమ్మాచలం గుర్తొచ్చాడు.

"నేను కూడా వచ్చేత్తున్నాను మావా" అంటూ మంచం కోడు మీంచి కిందికి దూకపోయిన రత్తాలు ఆగిపోయింది.

మంచం మీద బాబు గుక్కపట్టి ఏడుస్తున్నాడు.

అప్పటివరకూ ఉన్మాదిలా ప్రవర్తించిన రత్తాలు స్పృహలోకొచ్చింది. తను చనిపోతే బాబు అనాథ అయిపోతాడు. వాడు సిమ్మాచలం ప్రతిరూపం. వాడి కోసమైనా తను బ్రతకాలి. అందుకోసం దేన్నైనా భరించాలి.

రత్తాలు ఆత్మహత్యా ప్రయత్నం విరమించుకుంది.

రెండోరోజు మామూలుగా పొలంపని కెళ్ళింది.

రత్తాలుని చూసిన నాయుడు గర్వంగా మీసం మెలేసుకున్నాడు.

ఆ రోజునించీ చిననాయుడుకి మనసైనపుడల్లా రత్తాలు గుడిశెకి వెళ్ళటం ప్రారంభించాడు.

రత్తాలు ఎదురు చెప్పలేదు.

వూళ్ళో అందరికీ తెల్సిపోయింది. చిననాయుడు రత్తాలుని ఉంచుకున్నాడని.

ఒక్కోసారి నాయుడు రత్తాలు గుడిశెలోనే నిద్రపోయేవాడు. మంచంమీద తన పక్కనే పడుకున్న నాయుడు ఆరడుగుల నాగుపాములా కనిపించేవాడు రత్తాలుకి. నాయుడు కౌగిట్లో బంధిస్తే పాము చుట్టల్లో చిక్కుకున్నట్లే ప్రాణం విలవిల్లాడేది. నాయుడు గురకపెట్టి నిద్రపోతుంటే సిమ్మాచలాన్ని కాటేసిన నాగుపాము మంచంమీద పడుకుని బుసకొడ్తున్నట్లే ఉండేది.

ఎన్ని నెలలు గడిచినా రత్తాలుకి తన గుడిశెలో దూరిన పాము భయం - చిననాయుడి భయం వదల్లేదు. ఒకటి తన మావప్రాణాలు తీసేస్తే మరొకటి తన మానాన్ని హరించి తనని మృతప్రాయం చేసింది. అందుకే ఈ రెండింటిలో ఏ ఒక్కటి గుర్తొచ్చినా గజగజా వణికిపోతుంది.

ఓ రోజు ఉదయం పాచిపని చేసుకుని గుడిశెలోకి పోబోతున్న రత్తాలు మంత్రించినట్లు ఆగిపోయింది. గుడిశెలో ఓ మూల పడుకుని ఉంది పాము - తన సిమ్మాచలాన్ని కాటేసిచంపినపాము- భయంతో రత్తాలు కాళ్ళు వణికాయి. ఈలోపలే నేల మీద ఆడుకుంటున్న బాబు దోగాడుతూ పాము వైపుకు వెళ్తున్నాడు. పాములేచి పడగవిప్పి బుసలు కొడుతోంది.

రత్తాలులో ఎక్కడలేని మొండిధైర్యం, తెగింపూ వచ్చేశాయి. తన బాబుకోసమే తను జీవచ్ఛవంలా బ్రతుకుతోంది. తనుఏమైనా పర్లేదు - బాబుని బ్రతికించుకుంటే చాలు అనుకున్న మరుక్షణం రత్తాలు చేతిలో పంటకోసే కొడవలి మెరిసింది. భద్రకాళిలా ఒక్క గావుకేకపెట్టి లోపలికి శరంలా దూసుకెళ్ళింది. ప్రమాదాన్ని పసిగట్టి కసిగా ఎగిరిన పాము కొడవలి వేటుకి రెండు తునకలై తెగిపడిపోయింది. మరో పదినిముషాలవరకూ రత్తాలు వణుకుతూనే ఉంది. బాబుని ఎత్తుకుని - గుండెలకు హత్తుకుని తెరలు తెరలుగా ఏడుస్తూనే ఉంది.

వణుకు తగ్గి - ధైర్యం చిక్కబట్టుకుని రెండు ముక్కలుగా పడిఉన్న పామువైపు చూసింది రత్తాలు. సన్నగా పెదవుల మీద చిరుదరహాసం మెదిలింది. తన మావని చంపేసిన పాముని తను రెండు ముక్కలుగా నరికి పగతీర్చుకుంది. తన శరీరాన్ని కాజేసిన పాముని... రత్తాలులో ఓ పథకం రూపుని సంతరించుకుంది. సాలోచనగా పడగ పడిఉన్నవైపు చూసింది. ఉత్సాహంగా లేచి - తను అనుకున్నట్లే అన్ని ఏర్పాట్లు చేసుకుంది. తర్వాత పాము తునకల్ని గుడిశెవెనుక చిదుగులుచేసి మంట పెట్టి కాల్చి వేసింది.

ఇపుడు తృప్తిగా ఉంది రత్తాలుకి. ముఖంలో ఎన్నడూలేని వెలుగుచోటు చేసుకుంది.

పొలం పనికి వెళ్ళే ముందు ప్రత్యేకంగా సింగారించుకుంది. ఉన్నవాటిలోకెల్లా కొద్దిగా మంచి చీరను ఏరి కట్టుకుంది. వాలుజడ వేసుకుని, జడలో పూలు తురుముకుంది.

పొలం గట్టున నిలబడి పనుల్ని పర్యవేక్షిస్తున్న చిననాయుడి వైపు కైపుగా చూసి నవ్వింది.

రెప్పవాల్చటం మరిచిపోయి చూశాడు నాయుడు. అద్భుత సౌందర్యరాశిలా కన్పిస్తోంది రత్తాలు.

పొలం పని అయాక ఇంటికెళ్ళేముందు నాయుడు సైగ చేశాడు. రత్తాలుకి తెల్సు నాయుడీరోజు తప్పకుండా తన గుడిశెకొస్తాడని.

అందుకే ఆ సాయంత్రం తలారా స్నానం చేసింది. కొప్పునిండా మల్లెపూలు పెట్టుకుంది.

బాగా చీకటి పడ్డాక నాయుడొచ్చాడు.

బుడ్డిదీపం వెల్తురులో రంభలా ఉంది రత్తాలు.

"ఏమిటీ విశేషం - అప్సరసలా ఉన్నావీరోజు" అన్నాడు నాయుడు రత్తాలుని కౌగిట్లోకి తీసుకుంటూ.

రత్తాలు శ్వాస పాముబుసలా ఉంది నాయుడికి.

"ఈరోజు అంతా కొత్తగానే ఉంది" అన్నాడు నాయుడు తృప్తిగా.

రత్తాలు కళ్ళు నాగుపాము పడగ మీద మణుల్లా మెరవటం చూసి మరోలా అర్థం చెప్పుకున్నాడు నాయుడు.

నాయుడికి పడుకోబోయేముందు పాలు తాగే అలవాటుంది.

ఆవులిస్తున్న నాయుడివైపు మురిపెంగా చూసి పాలగ్లాసు అందించింది.

నాయుడు పాలు తాగుతుంటే నవ్వుతూ చూసింది. రత్తాలు కళ్ళలో అంతులేని తృప్తి - తన శత్రువుని కసిగా కాటేశాక పాముకి కలిగే తృప్తి.

పాలుతాగి మీసాలు తుడుచుకుని మంచంమీద పడుకున్నాడు నాయుడు. మరునిముషంలో మెలికలు తిరిగి పోతున్నాడు - నోటి నుండి నురగలు కక్కుతున్నాడు.

సంతృప్తిగా - కళ్ళారా - మనసారా చూసుకుంది రత్తాలు.

నాయుడిలోచలనం ఆగిపోయిందని నిర్ధారించుకున్నాక తలపిన్ను తీసి నాయుడి ఎడమ మడిమ దగ్గిర రెండు గాట్లుపెట్టింది.

జుట్టంతా విరబోసుకుంది. బాబుని భుజం మీద ఎత్తుకుంది.

"ఓలమ్మో పాము.. అమ్మో పాము" అని పెద్దగా అరుస్తూ - శోకాలు తీస్తూ బైటకు పరుగెత్తింది.

చుట్టుపక్కల గుడిశెల్లోని వాళ్ళందరూ కర్రలూ, లాంతర్లూ పట్టుకుని పరుగెత్తుకుంటూ వచ్చారు.

మంచం మీద నురగలు కక్కుకుని నాయుడుచనిపోయి ఉన్నాడు.

ఆ గుడిశెలోని అంగుళం అంగుళం వెదికినా పాము జాడ తెలియలేదు.

బైట - చీకట్లో కూచుని రత్తాలు శోకాలు పెడుతూనే ఉంది. ఆమె కళ్ళు మిన్నాగుల్లా కదలటం ఆ చీకట్లో ఎవరూ గమనించనేలేదు.

● *మయూరి వీక్లీ 6 అక్టోబర్, 1995* ●